ప్రజాశక్తి

శుక్రవారం 28 జులై 2023



1న పార్వతీపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకొని 18 నుంచి 35 ఏళ్ల మధ్య గల నిరుద్యోగ యువతీ యువకులకు ఈనెల స్థానిక శ్రీ సాయిరాం డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళా జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మినీ జాబ్ మేళాకు వివిధ కంపెనీల ప్రతినిధులు హాజరై, అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకుంటారన్నారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువత తమ వివరాలను www.apssdc.in వెబ్ సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెస్యూమే, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరుగు ప్రదేశంలో హాజరు కావలసినదిగా కోరారు. మరిన్ని వివరాలకు 6305110947,6303493720 సంప్రదించాలన్నారు.

కొటియా గ్రామాల్లో ఇంటింటికీ రేషన్

ప్రజాశక్తి - సాలూరు

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒడిశా ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది. గురువారం కొటియా పంచాయతీ పరిధిలో ఉన్న ఎగువ శెంబిలో ప్రత్యేక వాహనం ద్వారా రేషన్ సరుకులను ఇంటింటికీ తిరిగి అందజేశారు. కొటియా గ్రామాల ప్రజలను మచ్చిక చేసుకోవడానికి ఒడిశా అధికారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రయత్నాల్లో ఇది కీలకమైనది. ఆంధ్రాలో ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరుకుల పథకాన్ని అమలు చేస్తున్నప్పటికీ అది మైదాన ప్రాంతవాసులకే పరిమితమైంది. గిరిశిఖర గ్రామాల్లో ఎపి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేయలేకపోతోంది. ముందుగా ఆంధ్రాలోనే ఇంటింటికీ రేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. అయితే గిరిజన ప్రాంతాల్లో మాత్రం ఆశించిన ఫలితాలు దక్కడం లేదు. ఇప్పటికీ కొంత దూరం నడిచి వెళ్లి రేషన్ సరుకులను గిరిజన లబ్దిదారులు తీసుకోవాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. కానీ ఒడిశా అధికారులు కొటియా గ్రామాల్లో ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేపట్టి విజయవంతమైనట్లు తెలుస్తోంది. ఒడిశాలోని తాలూకా కేంద్రం పొట్టంగి నుంచి కొటియా గ్రామాలకు రహదారి సౌకర్యం ఏర్పడడంతో ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేయడానికి మార్గం సుగమమైంది. సాలూరు నుంచి కొటియా గ్రామాల రహదారి సౌకర్యం ఉన్నా రేషన్ లబ్దిదారులు బయోమెట్రిక్ వేయడానికి సెల్ ఫోన్ సిగ్నల్స్ సమస్యగా కనిపిస్తోంది. దీంతో పూర్తి స్థాయిలో కొటియా గ్రామాల్లో ఎపి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ బియ్యం పథకాన్ని అమలు చేయలేకపోతోంది.

ఎపి అధికారులను అడ్డుకున్న నాయకులు



కొటియాలో ఇంటింటికీ రేషన్ సరుకులు ఇస్తున్న ఒడిశా అధికారులు

ఎపి అధికారుల్ని అడ్డుకున్న ఒడిశా నాయకులు

కొటియా గ్రామాల్లో అటవీ ఆధారిత మల్టీ ప్రొడక్ట్ ఇండస్ట్రీ ఆర్టిజాన్స్ పరిశీలన కోసం వచ్చిన కేంద్ర ప్రభుత్వ అధికారుల వాహనాన్ని ముడకారు గ్రామం వద్ద ఒడిశాకు చెందిన బిజెడి నాయకులు అడ్డుకున్నారు. కేంద్ర ప్రభుత్వ చిన్న, మధ్యతరహా భారీ పరిశ్రమల శాఖకు ఎంఎస్ఎంఇ స్ఫూర్తి క్లస్టర్ ఎడి డివిఎస్ఆర్ మూర్తి, సెర్ప్ రాష్ట్ర అధికారి ఈ.సుధాకర్‌తో సహా వైకెపి జిల్లా అధికారులు దేవ్‌మల పర్యాటక ప్రదేశం చూడ్డానికి వెళ్తుండగా మార్గమధ్యలో ముడకారు వద్ద బిజెడి నాయకులు కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆంధ్రా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. జై నవీన్ పట్నాయక్, జై బిజెడి అంటూ నినాదాలు చేశారు.

ఆదర్శ పాఠశాలలో స్టాక్ పరిశీలన

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక ఆదర్శ పాఠశాలను తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వండుతున్న మధ్యాహ్న భోజన స్టాక్ రికార్డులను పరిశీలించగా బియ్యం 25 కేజీలు స్టాకు తక్కువ ఉందని పై అధికారులకు తెలిపారు. ఈ తనిఖీలో సివిల్ సప్లై డి టి ఎ.సాంబమూర్తి పాల్గొన్నారు.

విజృంభిస్తున్న వ్యాధులు

ప్రజాశక్తి - పాలకొండ, పాలకొండ రూరల్

ఏజెన్సీలో అతి సమీపాన పాలకొండ మండలం ఉండడంతో వర్షాకాలం వస్తే వర్షాలు వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇది ప్రతిఏటా షరామామూలుగానే మారింది. అధికారులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో వ్యాధులు వచ్చాక రోగులు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పల్లెలతో పాటు పట్టణాల్లోనూ జ్వర పీడితులు సంఖ్య ఎక్కువ అవుతోంది. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇంటింటా వైద్య సేవలందించాల్సిన అధికారులు తూతూ మంత్రం గా సేవలందిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ కేంద్రంలో గల ఏరియా ఆస్పత్రికి రోజుకు 30 నుంచి 40మంది వరకు జ్వరపీడితులు వస్తున్నట్లు ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. మండలంలోని గల పిహెచ్‌సి ఎం.సింగుపురంలో కూడా అధిక సంఖ్యలో రోగులు జ్వరాలతో వస్తున్నట్లు పిహెచ్‌సి చెబుతున్నారు. గతనెల 2డెంగీ కేసులు, నాలుగు మలేరియా కేసులు, 8 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి.

పెరుగుతున్న డెంగీ కేసులు

కొద్దిరోజులుగా పాలకొండతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో డెంగీ కేసులు పెరుగుతున్నాయి. గత నెల ఏరియా ఆస్పత్రిలో 5 డెంగీ కేసులు, 25 టైఫాయిడ్ కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ఈనెల 4 డెంగీ కేసులు నమోదైనట్లు తెలిసింది. ప్రస్తుతం ఆస్పత్రిలో ఏ.పారయ్య, యశోద చికిత్స పొందుతున్నారు. ఆర్థిక స్థోమత ఉన్న వారు ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇక్కడ నయం కాని కేసులు శ్రీకాకుళం, విశాఖపట్నం రిఫర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వ్యాధులను అదుపులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్య మెరుగునకు తక్షణమే చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.



రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
వేధిస్తున్న పారిశుధ్య సమస్య



ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

పీడిస్తున్న పారిశుధ్య సమస్య

పాలకొండ నగర పంచాయతీతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య సమస్య పీడిస్తోంది. జనాభాకు తగ్గట్టుగా పారిశుధ్య కార్మికులు, డంపింగ్‌యార్డులు లేకపోవడంతో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. దీంతో వీధులతో పాటు ప్రధాన రహదారుల్లో చెత్తకుప్పలు ఎక్కడికక్కడ దర్శనమిస్తున్నాయి. నగరం పంచాయతీలోని గురువుగారి వీధి, కోమటిపేట, పట్టువీధి, ఇందిరానగర కాలనీ, గాయత్రీనగర్ కాలనీ తదితర చిన్నపాటి వర్షం కురిసిన కాలువల్లోని మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దోమలబారిన పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సరిపడా పారిశుధ్య కార్మికులను నియమించి, కాలువలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

విదేశీ విద్యాదీవెన నగదు జమ

ప్రజాశక్తి - పార్వతీపురం

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంలో భాగంగా విద్యార్థుల ఉన్నత చదువులకు విదేశీ విద్యా దీవెన నగదు జమ చేసి ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో గురువారం లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా బటన్ నొక్కి రూ.45.53 కోట్లు జమ చేశారు. జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ కలెక్టర్ కార్యాలయంలో పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఈ పథకం కింద ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు రూ. 1.25 కోట్ల వరకు ఫీజు రీయింబర్స్మెంట్ చేయనున్నామని, ఇతర విద్యార్థులకు కోటి రూపాయల వరకు 100 శాతం ఫీజు రీయింబర్స్మెంట్ వర్తించనుందన్నారు. ఈ దఫా 357 మంది విద్యార్థులను ఈ పథకం కింద అర్హులకు లబ్ది పొందనున్నారని అన్నారు. పీజీ, పీహెచ్డీ, ఎంబీబీఎస్ కోర్సులకు సంబంధించి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంతో మేలు జరగనుందని వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి గయాజుద్దీన్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం : ఎస్‌పి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్లో పెండింగ్లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి పూర్తి చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన జిల్లా నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులు, నమోదైన కేసులు, పెండింగ్‌లో నున్న కేసులకు సంబంధించిన పూర్తి వివరాలను, అర్ధ సంవత్సరానికి చెందిన క్రైమ్ రివ్యూ అడిగి తెలుసుకొని సాధ్యమైనంత వరకు త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రేవ్ కేసులు, ఎన్‌డిపిఎస్ కేసులు, ఐటి యాక్ట్ కేసులు, మహిళలపై జరిగే అన్యాయాలు, ఆస్తుల దొంగతనాలు వంటి కేసుల గురించి వివరాలు విశ్లేషించి వాటి దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జ్‌షీట్ ఫైల్ చేసి సిసి, ఎస్‌సి నెంబర్లు పొందాలని ఆదేశాలు జారీచేశారు. అలాగే పెండింగ్లో ఉన్న ఫోక్సో యాక్ట్ కేసులు, రోడ్డు ప్రమాదాలు సంబంధించి కేసులు, బాలబాలికలు, మహిళల మిస్సింగ్ కేసులు, 174 సిఆర్‌పిసి కేసుల వివరాలు తెలుసుకొని వాటిని త్వరితగతిన దర్యాప్తు జరపాలని తగు సూచనలు ఇచ్చారు.

ఎక్సైజ్ కేసులు, గంజాయి అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, డ్రంకెన్‌అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ కేసులు, ఎన్ఫోర్స్మెంట్ పనులను సమీక్షించి తగు ఆదేశాలు ఇచ్చారు. జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమానికి సంబంధించిన ఫిర్యాదులు, ఫోన్ కాల్స్, పట్ల అప్రమత్తంగా ఉండాలని, సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. సీతంపేట పోలీసు స్టేషన్ పరిధిలో గల హడ్డుబంగికి చెందిన మహిళను గాయపరచి పుస్తులతాడును లాక్కొని పోయిన ముద్దాయిని చాకచక్యంగా వ్యవహరించి 12 గంటల్లో పట్టుకొని అరెస్ట్ చేసి చోరీ అయిన సొత్తును రాబట్టి బాధితులకు న్యాయం చేసిన పాలకొండ ఎస్ఐ బి.శివప్రసాద్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. నేర సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) డాక్టర్ ఓ.దిలీప్ కిరణ్, ఎఎస్‌పి సునీల్ షరోన్, యుఎస్‌డిపిఒ జివి కృష్ణారావు, దిశా డిఎస్పీ ఎస్.ఆర్‌సి హర్షిత, ఎస్‌బి సిఐ సిహెచ్.లక్ష్మణరావు, డిసిఆర్‌బి సిఐ ఎన్‌వి ప్రభాకర రావు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి విక్రాంత్‌పాటిల్,; హాజరైన పోలీసు అధికారులు

అక్టోబరు 2 నుండి 'ఆడుదాం ఆంధ్ర'

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం అక్టోబరు 2న ప్రారంభం అవుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా. కె.ఎస్. జవహర్ రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురు వారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫిట్ ఆంధ్రా ధ్యేయంతో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం గ్రామ, వార్డు సచివాలయం స్థాయి నుండి మండల, నియోజక వర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. గ్రామం, ప్రాంతంలో గల స్థానిక క్రీడలతో సహా మూడు కిలో మీటర్ల మారథాన్, యోగా, టెన్నికోయిట్ వంటి క్రీడలు ముఖ్యంగా క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీ బాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలను పురుషులు, మహిళలకు నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఆయా గ్రామాలకు చెందిన అభ్యర్థులు క్రీడలలో పాల్గొనవచ్చు అన్నారు. గుర్తింపు కార్డుగా ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు చూపించాలని ఆయన పేర్కొన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం 46 రోజుల పాటు కొన సాగుతుందని ఆయన చెప్పారు. ఈ పోటీల్లో విజేతలకు నియోజక వర్గ రాష్ట్రస్థాయిలో బహుమతులు ఉంటాయన్నారు. లోగో, మస్కట్ లను రూపొందించుటకు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనితీరు ఇంకా మెరుగు పడాలని, దీనిపై దష్టి సారించాలని ఆయన స్పష్టం చేశారు. ఫ్యామిలీ డాక్టరు శిబిరాల్లో భాగంగా గ్రామాల్లో తాగు నీరు, పారిశుధ్య పరిస్థితులు పరిశీలించాలని చెప్పారు. ఎఎన్ఎం స్థాయిలో లేవనెత్తిన పారిశుధ్యం తదితర అంశాలపై మునిసిపల్, పంచాయతీ శాఖ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. నీటి ద్వారా, దోమలు తదితర కారకాల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఆగస్టు 20న జాతీయ డీ వార్మింగ్ డే నిర్వహించాలని ఆయన సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి. విష్ణు చరణ్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కోతకు గురైన నీలవలస - గుమ్మిడిగూడ రోడ్డు

కోతకు గురైన రహదారి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని గుమ్మిడిగూడ పంచాయతీ నీలంవలస -గుమ్మిడిగూడ వరకు 6.8 కిలోమీటర్లు బిటి రోడ్డు నిర్మాణం ప్రధానమంత్రి సడక్ యోజన పథకం కింద రూ.3.76 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నారు. గతేడాది అక్టోబర్‌లో రోడ్డు పనులకు సంబంధించి డిప్యూటీ సీఎం పి రాజన్న దొర భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ మేరకు 6.8 కిలోమీటర్ల పొడవున బిటి రోడ్డు పనులు పూర్తయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా కల్వర్టులు నిర్మించకపోవడంతో గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేని వర్షాలతో కొండవాగు వరద నీరు ప్రవాహంతో రోడ్డు పలుచోట్ల కోతకు గురైంది. కొన్నిచోట్ల రోడ్డు పెచ్చులూడి వరద ప్రవాహంలో కొట్టుకుపోయాయి. అలాగే మరికొన్నిచోట్ల రాళ్లు తేలాయి రహదారి పాడవ్వడంతో అటుగా ఉన్న పలు గిరిజన గ్రామాల గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై పంచాయతీరాజ్‌శాఖ డిఇ చిన్నంనాయుడును వివరణ కోరగా, ఆగస్టు 31లోగా పనులు పూర్తికి తుది గడువని చెప్పారు. నిర్మాణ దశలో అధిక వర్షాలు కురవడంతో కొండవాగుల ప్రవాహానికి రోడ్డు కోతకు గురైందన్నారు. రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదని పనులు కొనసాగుతున్నాయని, రోడ్డు వరద ప్రవాహానికి కోతకు గురికాకుండా అవసరమైన చోట కల్వర్టుల నిర్మాణానికి పై అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని ఆయన తెలిపారు.

అనారోగ్య లక్షణాలుంటే వెంటనే తెలపండి

ప్రజాశక్తి - సీతానగరం

విద్యార్థులు అనారోగ్య లక్షణాలుంటే వైద్య సిబ్బందికి వెంటనే తెలియజేయాలని జిల్లా ఇమ్యూనికేషన్ అధికారి (డిఐఒ) టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని మరిపివలస సాంఘిక సంక్షేమ బాలిక వసతి గృహం, జోగింపేట కస్తూరిబాయి పాఠశాలలో విద్యార్థులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్య లక్షణాలు విద్యార్థులు కలిగి ఉంటే వాళ్ల లక్ష్యాలను చేరుకోవడం కష్టమవుతుందన్నారు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రక్త పరీక్షలు నిర్వహించారు విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ మాత్రలను వేయించారు. విద్యార్థులు పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతతో పాటు పరిసర ప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ధర్మరాజు, సూపర్వైజర్ జయగౌడ్, వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాలో పిఎం కిసాన్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పిఎం కిసాన్ నిధులు రైతుల ఖాతాలో గురువారం జమ చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయశాఖాధికారి రాబర్ట్ పాల్ వెల్లడించారు. ఈ మేరకు మండలంలోని ఉల్లిభద్ర రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రేగిడి విజయభారతి, గ్రామపంచాయతీ సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి ప్రత్యక్షంగా పిఎం కిసాన్ ప్రోగ్రాంను వీక్షించారు. ఈ సందర్భంగా జెడి మాట్లాడుతూ గరుగుబిల్లి మండలంలో దాదాపు 7624 మంది రైతులకు పిఎం కిసాన్ సమ్మాన్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. అయితే ఇందులో 6,611 మంది రైతులకు ఇకెవైసి చేయడం జరిగిందన్నారు. ఇకెవైసి చేసుకున్న ప్రతి రైతుకు 14 విడత నిధులు రైతుల ఖాతాలో జమ కానున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉల్లిభద్ర ఆర్‌బికె అగ్రికల్చర్ అసిస్టెంట్ గాయత్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణ

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు తరలిరండి

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

విజయవాడలో జరగనున్న ఆగస్టు 21, 22తేదీల్లో ఎపి ఎన్‌జిఒ 21వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు పెద్దఎత్తున ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక ఎన్‌జిఒ భవనంలో పార్వతీపురం, కురుపాం తాలూకా యూనిట్ల ఎన్‌జిఒ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు జరుగనున్న రాష్ట్ర కౌన్సిల్ సమావేశం విజయవంతం చేయాలని కోరారు. దీనికి సంబంధించి కార్యాచరణ ప్రణాళికను వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగ్మోహ్మన్‌రెడ్డి మొదటి రోజు విచ్చేస్తారని తెలిపారు. పండుగ వాతావరణంలో జరిగే కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ తప్పని సరిగా హాజరు కావాలని తెలిపారు. దీనికి సంబంధించి సావనీర్ విడుదల, ఉద్యోగులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. రాష్ట్రసంఘం ఇచ్చిన ఆదేశాలు మేరకు రెండు తాలూకా యూనిట్ అధ్యక్ష కార్యదర్శులతో పాటు మిగిలిన కార్యవర్గసభ్యులు దీనిపై దృష్టి పెట్టాలని కోరారు. ఎక్కువ మంది ఉద్యోగులను కౌన్సిల్ సమావేశాలకు హాజరైనట్టు తగుచర్యలు తీసుకోవాలని పిలుపు నిచ్చారు. సభను విజయవంతం చేసి ఎపి ఎన్జీఓ ఐక్యతను, బలాన్ని తెలియపరచేలా ఉండాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా కార్యదర్శి ఆవు సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు కెబి శ్రీను, పార్వతీపురం అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్, అసోసియేట్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, కురుపాం తాలూకా యూనిట్ అధ్యక్షులు ప్రకాశరావు, కార్యదర్శి రామకృష్ణ, రెండు యూనిట్ల కార్యవర్గ సభ్యులు, ఎపి ఎన్జీఓ సంఘం నాయకులు పాల్గొన్నారు.

టిడిపి పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా విజయ్‌చందర్




ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

పార్వతీపురం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బోనెల విజయ్‌చందర్‌ను నియమించారు. ఈమేరకు టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం నియామకం జరిగినట్లు గురువారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు విడుదల చేశారు. గత కొద్ది రోజులుగా నియోజకవర్గం ఇన్చార్జి మార్పు జరుగనున్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, అనూహ్యంగా పార్టీ ఈ నిర్ణయం తీసుకోవడం టిడిపి నాయకులకు అభిమానులకు ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. ఈనెల 6న మంగళగిరి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్,, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులతో పాటు మండల పార్టీ అధ్యక్షులతో చంద్రబాబు నిర్వహించిన సమావేశంలో వారి అభిప్రాయాలకు అనుగుణంగా వైసీపీకి ధీటైన అభ్యర్థిని ఎంపిక చేస్తానని ఇచ్చిన మాట ప్రకారం ఈ మార్పు జరిగినట్లు భావిస్తున్నారు.

అర్బన్ రీసర్వేకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

అర్బన్ రీ సర్వేకు పట్టణ ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ జె.అప్పలనాయుడు అన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంలో భాగంగా ఇటీవల పార్వతీపురం అర్బన్‌లో గల 3,100 ఎకరాలు (12.58 చ,, కి,మీ) విస్తీర్ణం గల వ్యవసాయ, నివాస స్థలాలు రీ సర్వే ప్రారంభమైన దృష్ట్యా గురువారం రీసర్వే జరుగుతున్న ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అర్బన్ పరిధిలో 13,780 పైగా గల నివాస, నివాసాయేతర భవనాలను 1,500 ఎకరాలకు పైగా గల వ్యవసాయ భూములను, 880 ఎకరాలకు పైగా ప్రభుత్వ స్థలాల సరిహద్దులను నిర్ణయించడం జరిగిందన్నారు. పట్టణ ప్రజలంతా తమ ఆస్తులకు సంబంధించిన భూ రికార్డులను వార్డు సచివాలయాల రెవెన్యూ సెక్రెటరీ, ప్లానింగ్ సెక్రటరీలకు అందజేసి మీ భూములకు సంబంధించి నిజనిర్ధారణ తేల్చుకోవాలని అన్నారు. అనంతరం కమిషనర్ వెంకంపేటలో గల జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న 176 ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లేఔట్‌లో రోడ్లు, నీటి సరఫరా, విద్యుత్ సౌకర్యానికి గృహ నిర్మాణశాఖ అధికారులతో కలిసి చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, హౌసింగ్ డిఇ ప్రసాదరావు, ఎఇ అప్పలనాయుడు, మున్సిపల్ ఎఇ సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.



రీసర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

ప్రజాశక్తి
www.prajasakti.com



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మణిపూర్ ప్రజలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - మక్కువ

మణిపూర్‌లో మహిళలపై దాడులు నిలిపివేసి వెంటనే ఆ రాష్ట్ర ప్రజలకు రక్షణ కల్పించేలా కేంద్రం నిర్ణయం చేయాలని సిఐటియు నాయకులు జి.కృష్ణ, ఎల్.దాలమ్మ డిమాండ్ చేశారు. మణిపూర్ సంఘటనలను నిరసిస్తూ గురువారం అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. దేశంలో మహిళలపై ప్రత్యేకించి మణిపూర్‌లో కుకితెగ గిరిజన మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నా, శాంతిభద్రతలు అదుపు చేయలేని విధంగా అక్కడ సిఎం వ్యవహరించారని విమర్శించారు. వెంటనే మణిపూర్‌లో శాంతిభద్రతలు చేయాలని, మహిళలపై దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వై.పద్మ, ఆర్.పోలమ్మ, పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.


వరినాట్లు వద్ద ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు తోయక సంధ్యారాణి

ఏజెన్సీలో భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి యాత్ర మండలంలోని కొండాడ పంచాయతీలో గురువారం నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టో ప్రజల్లోకి క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని మహాశక్తి ప్రచారకర్త తోయక సంధ్యారాణి అన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి యాత్ర మహిళ నేతలతో కలిసి ఆమె పాల్గొన్నారు. అనంతరం స్థానిక మహిళా నాయకులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్తులో 2024 టిడిపి ప్రభుత్వం వస్తేనే మన సమస్యలు పరిష్కరించుకోగలమని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టి సెల్ రాష్ట్రకార్యదర్శి బిడ్డిక చంద్రరావు యూనిట్ ఇంచార్జ్ బిడ్డిక ప్రవీణ్ సాయి సోను, ఎస్సీ సెల్ అధ్యక్షులు గంట సుధా, ఎంపిటిసి సభ్యులు ఆరిక సువర్ణ, సర్పంచ్ బిడ్డిక సుజాత, నిమ్మక రోజా, నిమ్మక దమయంతి, సరిత, కుండంగి సావిత్రి, హరిత, వరలక్ష్మి, ఊలక కాంతకుమారి, వార్డుసభ్యులు కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలు సందర్శన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మల్లిలో గల ప్రతిభ కళాశాలను గిరిజన బాలుర గురుకుల పాఠశాలను లోకయుక్త డిప్యూటీ డైరెక్టర్ శ్రీకృష్ణుడు గురువారం సందర్శించారు. ముందుగా మల్లి గిరిజన బాలుర గురుకుల పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల భోజనం గురించి ఆరా తీశారు. డార్మెంటరీ డైనింగ్ హాల్, రికార్డులు, మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యా ప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతిభా కళాశాలను సందర్శించారు. అక్కడ మెనూ గురించి ఆరా తీశారు. ప్రభుత్వం ఇచ్చిన మెనూ ప్రకారం ఏ విధంగా అమలు జరుగుతుందో క్షుణంగా పరిశీలించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాళ్లు వాసుదేవ్, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం రాయితీపై కంది విత్తనాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

రైతులకు శత శాతం రాయితీపై కంది విత్తనాలను పంపిణీ చేస్తున్నట్టు జిల్లా వ్యవసాయ శాఖఅధికారి రాబర్ట్ పాల్ తెలిపారు. మండలంలోని ఉల్లిభద్రలో రైతుభరోసా కేంద్రంలో గురువారం రైతులకు శతశాతంరాయితీపైకంది విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంది విత్తనాలను వరిపంటలు పండించే పొలం గట్లపై వేసుకోవాలన్నారు. కంది విత్తనాలు వేసుకోవడం వల్ల వరి పంటకు రక్షణగా ఉంటుందని, అలాగే రైతులకు అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ రేగిడి విజయభారతి, గ్రామపంచాయతీ సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి, విఎఎ గాయత్రీ దేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు పుస్తకాలు, పెన్నులు వితరణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్ కె.కృష్ణమూర్తి పట్టణంలో ఉన్న ప్రభుత్వ బాలికల వసతి గృహంలోని పేద విద్యార్థినిలకు నోట్ బుక్, పెన్నులు, అబ్దుల్ కలాం, దేశ నాయకులు, జీవిత చరిత్ర పుస్తకాలు హాస్టల్ వార్డెన్ కె.కూర్మమ్మ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యుత్తమ శిఖరాలకు ఎదగాలంటే మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, దేశ నాయకుల జీవిత చరిత్ర పుస్తకాలను ప్రతి ఒక్క విద్యార్థులు చదవాలని అన్నారు. కార్యక్రమంలో విజయమ్మ ,చిన్నమ్మ, దమయంతి పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక గిరిజన బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో గురువారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 84వ వర్ధంతి ప్రధానోపాధ్యాయులు ఎ.లిల్లీరాణి నిర్వహించారు. విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబ్దుల్‌కలాం అందరికీ ఆదర్శమని, ఆయన అడుగుజాడల్లో యువత ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు.

చదువుతో పాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి - సీతంపేట

చదువుతో పాటు క్రీడలు ఆటపాటలు అవసరమని ఐటిడిఎ స్పోర్ట్స్ ఇంచార్జ్ ఎన్.జాకబ్ దయానంద్ అన్నారు. గురువారం స్థానిక గిరిజన బాలుర ఆశ్రమోన్నత పాఠశాలలో వ్యాయామం గేమ్స్ స్పోర్ట్స్‌పై అవగాహన కల్పించారు. క్రీడల్లో విద్యార్థులు జాతీయ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రరావు, డిప్యూటీ వార్డెన్ గానయ్య, నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరఘట్టంలో జగనన్న సురక్ష

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టం-2,4 సచివాలయాల పరిధిలో ఈనెల 28న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.జయంతి ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ పి.విక్రాంత్ హాజరవుతారని తెలిపారు.

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పి.చాకరాపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి సామల సింహాచలం గురువారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించారు. విద్యార్థుల చేతిరాతను జాగ్రత్తగా పరిశీలించి తప్పులను సరి చేయాలనిఉపాధ్యాయులకు సూచించారు. తరగతి గోడలపై రాసిన ఇంగ్లీషు, తెలుగు వాక్యాలను, పేర్లను ఒకటి, రెండో తరగతి విద్యార్థులు చక్కగా చదవడంతో చిన్నారులను మెచ్చుకున్నారు. మెనూ బోర్డుపై రాగి జావను కూడా రాయించాలని, రికార్డులను, రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణ, వంటగది పరిశుభ్రంగా ఉండటం పట్ల ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.



విద్యాబోధనను గురించి అడిగి తెలుసుకుంటున్న ఎంఇఒ సింహాచలం

సమస్యల పరిష్కష్కారానికే 'జనన్న సురక్ష'

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ఎన్నో ఏళ్లుగా పరిష్కారం లభించని అనేక సమస్యలకు శాశ్విత పరిష్కారం చేసి చూపిన గొప్ప కార్యక్రమం జగనన్న సురక్షమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని కృష్ణపల్లి, లక్ష్మీ నారాయణపురం సచివాలయాల్లో గురువారం జరిగిన సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న దరఖాసుదారులకు ధ్రువపత్రాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగనన్న సురక్ష క్యాంప్ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. అనంతరం అక్కడి నుంచి లక్ష్మీనారాయణపురం చేరుకుని ఆ సచివాలయం వద్ద జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రభుత్వం మంజూరు చేసిన 11 రకాల అత్యవసరమైన దవీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. s పరిష్కారం కాకుండా ఇంకా ఏమైనా సమస్యలుంటే తెలపాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బోమ్మి రమేష్, వైస్ ఎంపిపిలు సిద్ధ జగన్నాధరావు, బంకూరు రవికుమార్, ఎంపిపి మజ్జి శేఖర్, స్థానిక సర్పంచ్లు బోను రామినాయుడు, జక్కు ప్రవీణ్‌కుమార్, తహశీల్దార్ శివన్నారాయణ, ఎంపిడిఒ ఎస్.రమేష్, ఆత్మ చైర్మన్ ఎంద్రాపు తిరుపతిరావు, వైసిపి సీనియర్ నాయకులు బలగ నాగేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, గృహ సారథులు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సాలూరు : ధ్రువపత్రాలను అందజేస్తున్న వైస్ ఎంపిపి రెడ్డి సురేష్

సాలూరురూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమం పేద ప్రజల పాలిట వరం అని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ తెలిపారు. మండలంలోని సారిక పంచాయతీ పరిధిలో సర్పంచ్ గొర్లె సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్‌పర్సన్ దండి అనంతలక్ష్మి, మండల జెసిఎస్ కన్వీనర్ కల్లేపల్లి త్రినాధ నాయుడు, ఎంపిడిఒ ఎ.రమాదేవి, తహశీల్దార్ మురళీకృష్ణ, ఎంపిటిసి సభ్యులు పూసూరు అమల, కురుకుట్టి ఎంపీటీసీ గేమ్మెల సుబ్బారావు, వైసిపి నాయకులు జి.రాజారావు, సువ్వాడ రామకృష్ణ, భరత్ శ్రీనివాసరావు, రాంబాబు, బీసూ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక శ్రీ కోదండరామ కల్యాణమండపంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి పి.గౌరమ్మ దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిదిమి సర్పంచ్ దమలపాటి ఉమామహేశ్వరరావు, తహశీల్దారు సిహెచ్ సత్యనారాయణ, ఎంపిడిఒ జి జయంతి ప్రసాద్, మేజర్ పంచాయతీ ఇఒ వి.రామచంద్రరావు, వైసీపీ పట్టణ అధ్యక్షులు డి.లలిత కుమారి, పిఎసిఎస్ డైరెక్టర్ భోగి మాణిక్య చంద్రశేఖర్, ఎఎంసి డైరెక్టర్ కె.ఆంజనేయులు, నాయీ బ్రాహ్మణ డైరెక్టర్ బి లక్ష్మీనారాయణ, సచివాలయాల సిబ్బంది , గ్రామ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని రంగంపేట, ఆర్.వెంకంపేటలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి కె.రామచంద్రరావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజానీకానికి మేలు చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వ నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజలకు అక్కడక్కడ 11 రకాల ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సేవ ధ్రువపత్రాలు పంపిణీ చేస్తుందన్నారు. అంతేకాక ప్రజలు ఎదుర్కొనే సమస్యను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిడిఒ ఎంఎస్‌ఎల్ ప్రసాద్, తహశీల్దార్ ఎంవి రమణ, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఆయా గ్రామ సర్పంచులు బి.భాస్కరరావు, పి.లక్ష్మి, వైసిపి నాయకులు బి.చిట్టిరాజు, ఇ.శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు

భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 31న మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. భోజన కార్మికుల సంఘం నాయకులు లక్ష్మి, పార్వతితో కలిసి ఆయన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజన కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో భోజన పథకానికి కేటాయింపు పెంచాలని కోరారు.

పాచిపెంట: సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న తలపెట్టిన కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయాలని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల కార్యదర్శి వై.మంగమ్మ, జి.కళ్యాణి, కోట ఆదమ్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను చిన్నచూపు చూస్తోందని, యూనిఫాంలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, వేతనం రూ.10వేలు చెల్లించే వరకు పోరాటం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కోరాడ లక్ష్మి, సిఐటియు నాయకులు కె.ఈశ్వరరావు పాల్గొన్నారు

ఓటరు సర్వే పక్కాగా జరగాలి

ప్రజాశక్తి - సీతంపేట

ఓటరు సర్వే పక్కాగా, పారదర్శకంగా జరగాలని ఐటిడిఎ ఎపిఒ రోసిరెడ్డి అన్నారు. గురువారం పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల బిఎల్‌ఒలు, సూపర్ వైజర్లతో ఐటిడిఎ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఎటువంటి తప్పిదాలు ఉండకూడదన్నారు. బిఎల్‌ఒలు ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసి ఓటర్ల జాబితాలోని తప్పిదాలను సరిచేయాలన్నారు. సున్నా నంబర్‌తో ఉన్న ఇంటి పేర్లను జాబితాను బాగా పరిశీలించి వాటిని సరిచేయాలన్నారు. ఒక కుటుంబంలోని సభ్యులంతా ఒకే పోలింగ్ స్టేషన్లో ఉండాలన్నారు. ఫారం-8 ద్వారా తప్పులను సరిదిద్దుకోవాలన్నారు. బిఎల్‌ఒలు క్షేత్ర స్థాయిలో పర్యటించాలన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల తహశీల్దార్లు, డిటిలు, ఎన్నికల డిటిలు, ఇతర ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి - కురుపాం

ప్రకృతి వ్యవసాయంతోనే రానున్న రోజుల్లో మానవ మనుగుడు సాధ్యమవుతుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రబంధకులు పి.షణ్ముఖరాజు అన్నారు. మండలంలోని రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రంలో రెండు ఎకరాల్లో సాగు చేస్తున్న పలు రకాల పంటల నమూనాలను రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ శ్రీవరి, శ్రీ రాగి, గులిరాగి, చిరుధాన్యాలు అయిన క్వినోవా, నాన్ బీటీ కాటన్, అనంతపురం మోడల్ మొదలగు పంటల నమూనాలను, దేశి వరి వంగడాలు అభివృద్ధి చేయడం జరుగుతుందని, రైతులకు ఇది ఒక ప్రయోగశాలగా ఉపయోగపడి వారి క్షేత్రాల్లో ఈ విధంగా చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి తెగుళ్ళ, పురుగులు రాకుండా కషాయలు ,ద్రావణాలు, జీవామృతాలు అందుబాటులో ఉంచాలని అన్నారు. కార్యక్రమంలో కెవికె ప్రాజెక్ట్ మేనేజర్ పాత్రో, సైంటిస్ట్ శ్రీనువాసరాజు, కన్సల్టెంట్ రమాప్రభ, ఎన్‌ఎఫ్ఎ అన్నపూర్ణ, ఫామ్ మేనేజర్ హరీష్, సీతారామ్, నరేష్ ఐసిఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా త్రినాధరావు

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా డిజిఎస్‌వి త్రినాధరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ప్రిన్సిపల్‌గా పనిచేసిన బి.రేణుక కొమరాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లారు. ఆయన పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి బదిలీపై వచ్చారు అనంతరం ఆయన మాట్లాడుతూ తోటి అధ్యాపకులు, గ్రామ పెద్దల సహకారంతో జూనియర్ కళాశాలను అభివృద్ధి చేసేందుకు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి కృషి చేస్తానని అన్నారు. ఆయనకు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

చేపల పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - భామిని

చేప పిల్లలు ఎంపికలో మెలుకువలు,చేపలు పెంపకం లో పాటించవలసిన యాజమాన్య పద్ధతులు గురించి మత్స్య కారులకు అవగాహన ఉండాలని సచివాలయం మత్స్య సహాయకులు కె.ఆదినారాయణ సూచించారు. మండలంలోని బిల్లుమడలో శ్రీ రామ మత్స్యకార సంఘం అధ్యక్షులు చెక్క శ్రీను ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ మత్స్య సాగుబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫిష్ ఆంధ్ర షాపులకు 30శాతం పట్టిబడిన చేపలను తప్పనిసరిగా సరఫరా చేయాలన్నారు. కార్యక్రమం లో స్థానిక మత్స్య కారులు పాల్గొన్నారు.


వరహాలగెడ్డలో పూడికతీతలను పరిశీలిస్తున్న కమిషనర్ రామప్పలనాయుడు

వరహాలగెడ్డలో పూడికలు తొలగింపు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

వర్షాకాలం దృష్ట్యా వరహాల గెడ్డ ప్రవహిస్తున్న పరిధిలో బైపాస్ రోడ్డు దగ్గర ఉన్న రైల్వే లైన్ వద్ద ఉన్న ఏడు ఖానాల కింద రైల్వే మూడో లైన్ నిర్మాణంలో భాగంగా మట్టితో పాటు చెత్తలు, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో గురువారం 50 ప్రైవేటు కార్మికులతో జరుగుతున్న పూడికతీతల పనులను మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారి జి. ఆనంద్, ప్రజారోగ్య అధికారి సిహెచ్. మురళితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు పడే అవకాశం ఉందని, వర్షం నీటితో పాటు, వాడుక నీరు వరహాల గెడ్డలో చేరడం వల్ల బైపాస్ కాలనీ ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న దృష్ట్యా ఈ పూడికతీత పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు.

తోటపల్లి కాలువలో తగ్గిన నీటి సరఫరా

ప్రజాశక్తి - గరుగుబిల్లి

తోటపల్లి ప్రాజెక్ట్ కుడి కాలువకు గండిపడడంతో ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు సాగునీటి సరఫరాను కొంతమేర తగ్గించారు. కాలువ పరిధిలోని బొబ్బిలి మండలం అలజంగి సమీపాన కాలువకు గండిపడింది. దీంతో గండిని పూడ్చివేసేందుకు సంబంధిత ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు సాగునీటి సరఫరాను కొంతమేర తగ్గించారు. కుడిప్రధాన కాలువ ద్వారా ఈ ఏడాది ఇటు అధికారులు, అటు ప్రజాప్రతినిధులు సమన్వయంతో అనుకున్న సమయం కంటే ముందుగానే సాగునీటిని విడుదల చేశారు. అయితే అలజంగి సమీపాన కాలువకు గండిపడడంతో ప్రస్తుతం సాగునీటి సరఫరాను తగ్గించడం జరిగిందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు అంటున్నారు. గండిని పూడ్చి వేసిన అనంతరం పూర్తి స్థాయిలో సాగునీటి సరఫరానుపునరుద్ధరించనున్నారు.

వికలాంగ పిల్లలను బడిలో చేర్పించండి

ప్రజాశక్తి - కురుపాం

వికలాంగ చిన్నారులను బడిలో చేర్పించాలని ఐఇఆర్‌టి, ఐఇడిఎస్‌ఎస్ అధికారులు సత్యవతి, శేఖర్ కోరారు. గురువారం మండలంలోని పెదగొత్తిలి, కైరాడ, దంగులగూడ గిరిజన గ్రామాల్లో ప్రత్యేకంగా దివ్యాంగ పిల్లలను గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గుర్తించిన చిన్నారులు వివరాలను ప్రశస్ట్ యాప్లో నమోదు చేసుకున్నారు. దివ్యాంగ పిల్లలకు ప్రభుత్వమే తగిన వైద్యసేవలు, సహాయ చర్యలు, సంక్షేమ పథకాలు సమకూర్చుతుంది కావున పిల్లలను బడిలో చేర్పించాలని తల్లితండ్రులను కోరారు.

కృష్ణరాయపురంలో గడపగడపకు...

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పెదఅంకలాం గ్రామ సచివాలయం పరిధిలో గల కృష్ణరాయపురంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి సమస్యను తెలుసుకొని పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో తెలుసుకునే సమస్యలను పరిష్కరించి వీధి రోడ్లు, కాలువలు గ్రామాభివృద్ధికి కావాల్సిన నిధులను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి బి.రమణమ్మ, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, గ్రామసర్పంచ్ గుణుపూరు అన్నంనాయుడు, వైసిపి నాయకులు బి.చిట్టిరాజు, రెడ్డి అప్పలనాయుడు, బి.శ్రీనివాసరావు, ఎన్.గోపాలనాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని కొండాడ గ్రామ సచివాలయ పరిధిలో కొండాడ, మేడ ఒబ్బంగి, ఇస్సరాయి, లోవగూడ, లోవగూడకాలనీలో "గడప గడప - మన ప్రభుత్వం" కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వి.కళావతి గడప గడపకు ప్రజల వద్దకు వెళ్లి, సంక్షేమ పథకాలు వస్తున్నాయా, వాలంటీర్లు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఇంటి ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు వివరాలు తెలియజేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొండాడలో కొత్తగా నిర్మించిన వాటర్ ట్యాంక్ ప్రారంభించారు. కార్యక్రమములో ఎంపిపి బిడ్డిక ఆదినారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి సవరరాము, స్థానిక సర్పంచ్ సవర. ముకుంద రావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, ఎంపిడిఒ కె.సత్యం, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

సిసి రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కడగండి పంచాయతీ పెద్దవంగర నుంచి పెద్దవంగరగూడ గ్రామానికి రూ.60 లక్షల అంచన విలువతో నిర్మించబోవు సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే వి.కళావతి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన ప్రతి సమస్యకు పరిష్కరించడం జరుగుతుందని, అందులో భాగంగానే ప్రజల విజ్ఞప్తి మేరకు తమ దృష్టికి వచ్చిన రోడ్డు సమస్యల కోసం పాలకొండ నియోజకవర్గంలో ఇప్పటి వరకు 70 ప్రధాన రోడ్లు అనుసంధానం చేయడం జరిగింది తెలిపారు. ప్రస్తుతం వచ్చిన నిధుల్లో రూ.6కోట్ల 20 లక్షల కేటాయిస్తామని, దీనిద్వారా మరికొన్ని రోడ్ల సమస్య పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. రాబోయే 2 నెలల్లో మిగిలిన అన్ని రోడ్లకు అనుమతులు లభిస్తాయని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్న గడపగడపకు కార్యక్రమం ద్వారా మీ ఇళ్లకు రావడం జరుగుతుందని తద్వారా అందరి సమస్యలకు సత్వర పరిష్కారం దొరుకుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ప్రతినిధి సవర రాము, స్థానిక సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


మోహనరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న బేబినాయన

మోహనరావుకు బేబినాయన పరామర్శ

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని కామన్నదొరకు చెందిన బుడితి మోహనరావు తల్లి ఇటీవల మరణించింది. ఈ సంగతి తెలుసుకున్న బొబ్బిలి మాజీ మున్సిపల్‌చైర్ పర్సన్ బేబీ నాయన గురువారం ఆ కుటుంబాన్ని పరామర్శించే ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయనతో పాటు మాజీ సర్పంచులు బి.గోపాలకృష్ణ, ఎం.పారినాయుడు, బి.శ్రీనివాసరావు, టిడిపి మండల కార్యదర్శి ఆర్.వేణుగోపాలనాయుడు, ఎస్.గోపాలరావు, దాసరి సింహాచలం పలువురు పాల్గొన్నారు.

యు.వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలం పరిధిలోని యు.వెంకంపేటలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వివిధ రకాలైన రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ నయామీ, ఏఎన్ఎం సరస్వతి ,104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎసిఎం పిచికారీ చేయించుకోవాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో టిక్కబాయి, వై.మండ గ్రామాల్లో ఎ సిఎం 5శాతం పిచికారీ చేపట్టారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి మోహన్ మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కువగా దోమలు వ్యాప్తి చెందుతాయని తెలిపారు. మలేరియా ఆడ ఏనాపలిస్టు దోమలు కుట్టడం వల్ల మలేరియా జ్వరాలు వస్తాయని చెప్పారు. ముందస్తు జాగ్రత్త చర్యగా ఎసిఎం పిచికారీ ప్రతి ఇంటి గోడలపైన, చుట్టుపక్కల పరిసరాల్లో చేయించుకోవాలని గిరిజనులను కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా ఉంచాలని, ఇంటి పరిసరాల్లో టైర్లు, కొబ్బరి బొండాల్లో నీరు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మండ సర్పంచి నిమ్మక హైమావతి, సెక్రటరీ ఎం.షర్మిల, ఆరోగ్య సిబ్బంది జి.అప్పల నాయుడు, ఎం.స్వాతి, నిమ్మకూరి రత్నప్రసాద్, మౌళి ఉన్నారు.

డైట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల భోజనాల డైట్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని గిరిజన అభ్యుదయ సంఘం జనరల్ సెక్రటరీ డి.సురేష్ డిమాండ్ చేశారు. గత విద్యా సంవత్సరం నుంచి నేటి వరకు వసతి గృహాలకు డైట్ బిల్లులు విడుదల చేయకపోవడంతో వార్డెన్లు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

టిడిపిదే అధికారం : జయకృష్ణ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

రాబోయే రోజుల్లో టిడిపియే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలో సింగన్నవలసలో భవిష్యత్తుకి గ్యారంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే మంచి పరిపాలన అందుతుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేని అప్పలనాయుడు, మండల పార్టీ కార్యదర్శి గండి రామినాయుడు, సిహెచ్.లక్ష్మీనారాయణ, వెన్నపు శ్రీనివాస రావు తదితరులు ఉన్నారు.

పలువురికి పరామర్శ

మండలంలోని నవగాం, ఎం.సింగుపురంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ గురువారం పలువుర్ని పరామర్శించారు. నవగాం మాజీ వైస్ సర్పంచ్ బూసరి పకీరు తండ్రి బూసరి జ్ఞానరావు అకాల మరణం చెందడం వల్ల ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే దనాన్న మన్మధ ఆరోగ్యం బాగులేనందున ఆయనను పరామర్శించారు. అలాగే దనాన్న సుధ అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను పరామర్శించారు. ఈ పరామర్శలో రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, కోట సంగం నాయుడు, మాజీ సర్పంచ్ మంకు భాస్కరరావు, మాజీ ఎంపీటీసీ మజ్జి పురుషోత్తం, లావేటి కంచిమ్ నాయుడు, మౌళి, ఆదినారాయణ, సుంకరి రాములు, పప్పల పాపినాయుడు, మండల వెంకటరమణ, బర్లి ఆది, కీర్తి నారాయణరావు, రాజన రామినాయుడు, పొట్నూరు శంకరరావు ఉన్నారు.

త్వరలో సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 34 పంచాయతీల పరిధిలో ఉపాధిహామీ చట్టం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించి త్వరలో గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేపట్టనున్నట్లు ఎస్ఆర్పీలు ఎం.గోవిందరావు, తిరుపతిరావు గురువారం విలేకరులకు తెలిపారు. రూ.17 కోట్లకు సంబంధించి ఆర్డబ్ల్యూఎస్, పంచాయత్ రాజ్, ఐటిడిఎ, ఉపాధి హామీ పనులకు సంబంధించి తనిఖీలు చేపట్టినట్లు వారు తెలిపారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి- పార్వతీపురంరూరల్

మండలంలోని నర్సిపురం కుమ్మరి వీధికి చెందిన శంబంగి జగదీష్ (18) విద్యుత్ షాక్‌కు గురై మరణించిన సంఘటన గురువారం జరిగింది. చిన్నప్పుడే తండ్రి మరణించడంతో చదువు మధ్యలో విడిచిపెట్టి కుటుంబ పోషణ నిమిత్తం ఎలక్ట్రికల్ పని చేస్తూ కుటుంబానికి ఆధారంగా మారాడు. గురువారం ఉదయం అదే గ్రామంలో కోట లక్ష్మి ఇంటి వైరింగ్‌కు సంబంధించి గాడీలు కోస్తుండగా, మిషన్‌కు ఉన్న విద్యుత్ తీగ జాయింట్ తగిలి కరెంటు షాక్ తిన్నాడు. స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. కూలి పనులు చేస్తున్న తల్లికి ఆధారంగా మారతాడనుకున్న ఒక్కగానొక్క కొడుకు ఆకస్మికంగా మరణించడంతో తల్లి శంబంగి లక్ష్మి రోధన హృదయాలను కలచి వేశాయి. శుక్రవారం తన అభిమాన నటుడు సినిమాకు టిక్కెట్ దొరికిందని.. అందరం కలిసి వెళ్దాం, అందుకు రేపు చేయాల్సిన పని ఈరోజే ముగించి వేస్తానని చెప్పి వెళ్లిన మిత్రుడు అంతలోనే శవంగా మారడాన్ని తోటి స్నేహితులు జీర్ణించుకోలేక పోతున్నారు.